విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్పందన అర్జీలను నాణ్యత ప్రమాణాలను విధిగా పాటిస్తూ సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డిఓ శివ నారాయణ రెడ్డిలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించారు. సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు,డ్వామా, డీఆర్డిఏ పిడిలు జి.వి. సూర్యనారాయణ, పి ఎస్ ఆర్ ప్రసాద్,డిపిఓ నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, ముడా విసి రాజ్యలక్ష్మి, డీఈవో తహేరా సుల్తానా, డి ఎస్ ఓ పార్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయ్ కుమారి, ఐసిడిఎస్ పిడి స్వర్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు పోస్టాఫిస్ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని బంటుమిల్లి పోస్టాఫిస్ అదికారి కె ప్రభుకుమార్ అన్నారు. ప్రపంచ తపాలా శాఖ దినోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు స్కూల్ డైరెక్టర్ సాబు జాన్ సారథ్యంలో సోమవారం బంటుమిల్లి తపాలా శాఖ కార్యాలయానికి ఫీల్డ్ ట్రిప్‌గా సందర్శించి అక్కడి అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందిగామ తిరుమల, ఎన్ శ్రీను, పోస్టల్ సిబ్బంది ఎం వి రామకృష్ణ, జి నాని బాబు, ఎంటిసి ప్రసాద్ పాల్గొన్నారు

కరాటేలో కొమ్మారెడ్డి విద్యార్థినీల విజయకేతనం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఈ నెల 8 వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కరాటే పోటీలలో స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తి, విశాఖపట్నం తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాల్ నందు ఒకినావ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన ఇన్విటేషనల్ సౌతిండియా కరాటే చాంపియన్ షిప్ 2023 నిర్వహించారని కిషోర్ తెలిపారు. స్థానిక కొమ్మారెడ్డి పాఠశాల విద్యార్థులు ఎం మహిమ(5వ తరగతి) 10 సం॥ల కరాటే విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించిందన్నారు. అలాగే జి ఐశ్వర్య (6వ) 11 సం॥ల కరాటే విభాగంలో, ఎ పుర్ణశ్రీ (4వ) 10 సం॥ల విభాగంలో, సిహెచ్ అక్షయ నాగసింధు (6వ) 11 సం॥ల విభాగంలో తృతీయ స్థానాలను సాధించారన్నారు. వీరికి తర్ఫీదు నిచ్చిన కొచ్ స్జునం వెంకటేశ్వరావుని, విద్యార్థులను డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఈ కేవైసీ నమోదుకు నేడు ఆఖరు

విశాలాంధ్ర-పెదపారుపూడి : రైతులు ఈ కేవైసీ నమోదు మంగళవారం సాయంత్రం 6 గంటలలోపు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లతో (వీఏఏ) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్పి ఆంజనేయరావు సోమవారం అన్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 18,000 ఎకరాల భూమి విస్తీర్ణములో రైతులు వరి పంట సాగు చేశారని అన్నారు. వరి పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ కూడా చేసుకోవాలని ఆ విధంగా నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం నమోదయిందని మిగిలిన రైతులు కూడా నమోదు చేసుకోవాలని అన్నారు. దూరంలో ఉన్న రైతులు ఆధారకు లింక్ అయినా మొబైల్ తో సంబంధిత ఆర్ బి కే ద్వారా ఆన్లైన్ చేసుకోవచ్చని ఆయన రైతులకు సూచించారు.

550 మందికి పైగా వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 550 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆ గ్రామంలోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరా న్ని ఉప సర్పంచ్ రాజులపాటి సుబ్బారావు ప్రారంభించగా వైద్య నిపుణులు డాక్టర్ ఏ నిహారిక, డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి, డాక్టర్ ఏ ఫణిశంకర్, డాక్టర్ ఏ సాయికిరణ్, ఆప్తాలజిస్ట్ అనూష నిర్వహించారు. సర్పంచ్ నాగనబోయిన సునీల్, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండిఓ జి సుధాప్రవీణ్ పర్యవేక్షించగా, మొవ్వ పిహెచ్.సి.సిహెచ్ఓ డి శంకరరావు, పీహెచ్ఎన్. డి శ్రీలక్ష్మి, మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని 9 సచివాలయాల ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, సాంకేతిక సిబ్బంది సిహెచ్ ఓలు, ఆశా వర్కర్స్, 104 డీఈవో కైలా కోమలి తదితరులు సహకరించారు.

దళితుల ఆశాజ్యోతి అంబేద్కర్ వాది కాన్షీరామ్

విశాలాంధ్ర-గుడివాడ : ఓట్లు మావి సీట్లు మీవా? చెల్లదు చెల్లదు అంటూ నినదించి బహుజన సమాజ్ పార్టీను స్థాపించి రాజ్యాధికారాన్ని చేపట్టే అంబేద్కర్ వారసుడు కాన్షీరామ్ అనీ బిఎస్పి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి బోసు, నియోజకవర్గం ఇన్‌చార్జి దారం కరుణాకర్, నియోజవర్గ అధ్యక్షులు ఎం.మరియ బాబులు అన్నారు. కాన్షీరామ్ 17వ వర్ధంతిని బిఎస్పి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక కోతిబోమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కన్షీరామ్ 17వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు బాబురావు, గురవయ్య, జయరాజు, మధు, మణిమ్మ, బేనర్జి, భాను, గోపి, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

SESHADRI RAO
GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge Village, GUDLAVALLERU - 521 356, Krishna District, A.P.
Ph: 08674-273737/273888, Website: www.gecgudlavalleru.ac.in
SPOT ADMISSIONS
B.Tech: Civil/EEE/ME/ECE/IT/AIDS/CSE(AIML)/IoT
Spot admission to the vacant seats in 1st B.Tech after internal sliding will be conducted on 11-10-2023 at 10:00 AM as per guidelines of the Convener, APEAPCET 2023. Interested students shall appear for selection and admission along with all original certificates, Tuition fee of Rs.71,500/-. Candidates admitted under spot admissions is not eligible for tuition fee reimbursement. For details, visit www.gecgudlavalleru.ac.in and contact college office 9848779121.
SRGEC/Advt/2023, dt.10-10-2023 Secretary & Correspondent

బాల్యవివాహాలపై అవగాహన

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా నిరోధించేందుకు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం నగరంలోని స్పందన సమావేశం మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై జిల్లాస్థాయి కన్వర్జేన్స్ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. బాల్య వివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని తెలియజేసే గోడపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించేందు కోసం ప్రభుత్వం తాజాగా జీవో నంబర్ 31, 39 లలో మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. బాల్య వివాహాలను చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు స్థాయి నుండి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులందరూ బాల్య వివాహాల నిరోధించేందు కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కొన్ని బాల్య వివాహాలు ప్రభుత్వం దృష్టికి రాకుండానే జరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా చదువుకోని తల్లిదండ్రులు, పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు బాల్య వివాహాల పట్ల మొగ్గుచూపుతున్నారన్నారు. ఈ పరిస్థితులను నివారించేందుకు డి ఆర్ డి ఏ ఏపీఎంలు, డీపీఎంలు, ఆనిమేటర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు బాధ్యత తీసుకొని స్వయం సహాయక మహిళ సంఘాల సభ్యులందరికీ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కలిగించాలన్నారు. పాఠశాల విద్యార్థినులకు కూడా ఈ విషయమై అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు వారికి వివాహం చేస్తారనే విషయం తెలియగానే సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ బాల్యవివాహాన్ని నిరోధించేందుకు వీలు కలుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కూడా బాల్యవివాహాల నిరోధంపై చర్చించాలన్నారు. గ్రామ వార్డు స్థాయిల్లో సంబంధిత సచివాలయాల మహిళా పోలీసులు, పరిపాలన కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీవోలు, మండల విద్యాధికారులు బాధ్యత తీసుకొని బాల్య వివాహాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. నెలకు ఒకసారి జరిగే గ్రామసభల్లో కూడా బాల్య వివాహాల నిరోధించుట పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, గ్రామ సభలలో సంబంధిత ఏఎన్ఎంలు ఆరోగ్య కార్యకర్తలు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. బిడ్డ పుట్టినప్పుడు కనీసం మూడు కిలోల బరువు ఉండాలని అలా కాకుండా బాల్య వివాహాలు చేసుకోవడం వలన తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా అటువంటి పిల్లల్లో సరైన ఎదుగుదల కూడా ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ఐసిడిఎస్ పిడి సువర్ణ ఆర్ డి ఓ శివ నారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిఆర్డిఎ డ్వామా పీడీలు పీఎస్ఆర్ ప్రసాదు సూర్యనారాయణ, డిఎస్ఓ పార్వతి ముడా విసి రాజ్యలక్ష్మి, డిఇఓ తహేరా సుల్తానా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పురోగతిలో ఓడరేవు పనులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మచిలీపట్నం ఓడరేవు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వివిధ పనులు పురోగతిలో ఉన్నాయని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ మ్యారీ టైం బోర్డు సీఈవో ప్రవీణ్ కుమార్ లు క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు ఓడరేవులు ఉన్న జిల్లాల కలెక్టర్లతో సంభాషించగా సోమవారం కృష్ణాజిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ పి.రాజాబాబు ఈ వీసీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధ పోర్టుల అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లాల వారీగా సిఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనుల పురోగతి గురించి చీఫ్ సెక్రటరీ కలెక్టర్ పి. రాజాబాబును వివరించమని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టు పనులు ఎటువంటి ఆటంకం లేకుండా నిర్విరామంగా కొనసాగుతున్నాయని, సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్ వాటర్ గోడల నిర్మాణాల భాగంగా ఇప్పటికి 825 మీటర్ల దూరం సముద్రంలోనికి కొండ రాళ్ళను పూడ్చుకుంటూ పటిష్టంగా ముమ్ముందుకు చొచ్చుకుపోతున్నట్లు కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. సౌత్ నార్త్ బ్రేక్ వాటర్ వాల్స్ నిర్మాణం కొరకు ఇప్పటివరకు సుమారు మూడున్నర లక్షల టన్నులకు పైగా కొండ రాళ్లను సముద్రంలో పూడ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సముద్రంలో మరోవైపు నార్త్ బ్రేక్ వాటర్ నిర్మాణంలో కోర్ లయింగ్ దశ 250 మీటర్ల నిడివి సైతం పూర్తయిందని ఆయన తెలిపారు. మరోవైపు కస్టమ్స్, సెక్యూరిటీ తదితర భవనాల పునాది దశలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 40 ఎకరాలలో బెర్త్ రిలేటెడ్ ఫైలింగ్ పనులు జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఏపీ మ్యారీ టైం బోర్డు సీఈవో ప్రవీణ్ కుమార్ లకు కలెక్టర్ పి రాజబాబు వివరించగా మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్న తీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శివయ్య, మెఘా ఇంజనీరింగ్ సంస్థ తరుపున రాఘవేంద్రరావు, రైట్ సంస్థ మేనేజర్ ఎంవిపి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేను సైతం అంటూ గర్జించిన మహిళా లోకం

విశాలాంధ్ర-అవనిగడ్డ : జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా నియోజకవర్గంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరసన దీక్ష 27 వ రోజుకు చేరింది. గత 27 రోజులుగా చంద్రబాబు పై పెట్టిన కేసులను ఎత్తివేసి, విడుదల చేయాలని చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ప్రజా క్షేత్రంలోనికి రావాలని వినూత్న రీతిలో నిరసన తెలియచేస్తున్నారు. ఈ నిరసనలో భాగంగా కోడూరు మండల పరిధిలోని జయపురం సర్పంచ్ పాలడుగు భార్గవి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలను మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించి దీక్షను ప్రారంభించి మాట్లాడారు. ఈ దీక్ష శిబిరాన్ని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బండె కనకదుర్గ, మోపిదేవి ఎం.పి.పి రావి దుర్గావాణి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండవా బాలవర్ధన్‌రావు, తుమ్మల చౌదరి బాబు, నాగాయలంక మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, రావి నాగేశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, గ్రామపార్టీ జనసేన అధ్యక్షులు రాజనాల వీరబాబు లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దొప్పలపూడి గంగాభవాని, మోర్ల జయలక్ష్మీ, కొక్కిలిగడ్డ మాధవి, మద్దాల శ్రావణి, వేమూరి ప్రభాకర్ రావు, యాసం లంకమ్మ, సనకా అన్నపూర్ణమ్మ మహిళలు దీక్షలో పాల్గొన్నారు.

మహిళలు అమ్మవారి అలంకరణ తో నిరసన

విశాలాంధ్ర-గన్నవరం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో సోమవారం 26వ రోజు గన్నవరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరావు అధ్యక్షతన ఉంగుటూరు మండల అధ్యక్షులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ నిరసనలో గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ పిలుపు మేరకు గన్నవరం టౌన్‌లో మహిళలు. అమ్మవారి అలంకరణతో పెద్దఎత్తున ఈ రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. గన్నవరం టౌన్ నుండి రాయ్ నగర్ ఏ పద్మ, యల్ కల్యాణి, వై జానికి దేవి,జె విజయకుమారి,ఏ శ్రీదేవి,దేవినేని సులోచన,అల్లా దమయంతి, టి శేషురత్నం, ఎం.లక్ష్మి,టి విజయ, జూపల్లి సురేష్, బొడ్డపాటి రవికుమార్, బూసే నాగ ప్రసాద్, బూసే సరితా, సీపీఐ నాయకులు కె విజయ రావు, కె సుగుణరావు,తదితరులు పాల్గొన్నారు.

పులవర్తి గూడెంలో బాబు కోసం మేము సైతం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ శివారు పులవర్తి గూడెంలో బాబు కోసం మేము సైతం అనే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను సోమవారం పంపిణీ చేసినట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చదలవాడ రాధా, రాసూరి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమంది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయం : ఎంపీడీఓ

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం మణిమేశ్వరం గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ స్వర్ణభారతి మాట్లడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్య ఆంధ్రపదేశ్ లక్ష్యంగా ఇంటి దగ్గరే బిపి ,హెచ్ బి , డయాబెటిస్,మలేరియా, వంటి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన వైద్య సహాయం అందజేయడం, జరుగుతుందన్నరు .డాక్టరు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్స్ చేయడం, గ్రామాలలో నిపుణులు అయిన వైద్యులు ద్వారా ఉచితంగా వైద్య సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రోజు మొత్తం 511 మందికి వైద్య సాయం చేశారు. 247 ల్యాబ్ పరీక్ష లు, 95 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేకవైద్యులా రంగనాద్ , ఆర్థోపెడిక్ డాక్టర్ సురేఖ, పిల్లల డాక్టరు, కంటి వైద్య నిపుణులు గంగరాజు ,మణిమేశ్వరం సర్పంచ్ డి ధనలక్ష్మి, డి మధుసూధనరావు, ఎంపిడిఓ జె .స్వర్ణ భారతి, తహసిల్ధారు ఎం సత్యన్నారాయణ ,ఇఓపిఆర్డీ త్రిపుర సుందరి, బంటుమిల్లి మెడికల్ ఆఫసర్ వి కె పవన్‌కుమార్, డాక్టరు సిహెచ్ సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ: మహిళ మృతి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి జాతీయ రహదారిపై స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందింది. పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన పిల్లలమర్రి పల్లవి(29). వైద్యం నిమిత్తం భర్త సత్యనారాయణతో కలిసి స్కూటీపై చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా లారీ ఢీకొనగా మహిళ మృతిచెంది. గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నామట్టి-నాదేశం కలశయాత్ర'

విశాలాంధ్ర-పమిడిముక్కల: కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో నామట్టి నాదేశం కలశ యాత్ర వీరంకిలాకు లో నిర్వహించారు.సోమవారం నెహ్రూ కేంద్ర జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల నుంచి మట్టి సేకరించామని,ఈ కలశాన్ని ఎంపిక చేసిన చాంపియన్స్ కి ఇచ్చి వారి ద్వారా ఢిల్లీ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో జరిగే జాతీయ స్థాయి కార్యక్రమానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యంపిడిఓ విఠల్ పాల్ యంపిపి కాసాని వేద సుప్రజ వైఎస్ యంపిపి లు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య రెడ్డిక కార్పోరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు యంపిటిసి జి.వంశీ నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ భీమాల వినోద్ స్కైఆర్గనేషన్ ప్రతినిధులు కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

15న ప్రపంచ కూచిపూడి నాట్యదినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా జిల్లాలోని నాట్య క్షేత్రమైన కూచిపూడి (మొవ్వ మండలం)లో నాల్గవ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తారీఖున కూచిపూడి నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్. మల్లికార్జునరావు తెలిపారు. ఆయన సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి ఓ ఎస్ డి రాజారాం, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ వ్యవస్థాపకురాలు భావన పెదప్రోలు, జయహో భారతీయం నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, పిఎస్ తెలుగు విశ్వవిద్యాలయంశ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, రాష్ట్ర పర్యాటక శాఖ కృష్ణాజిల్లా మేనేజర్ జి రామలక్ష్మణ్ లతో కలిసి భారీ స్థాయిలో సభా కార్యక్రమాలను, నాట్య కార్యక్రమాలను ఈనెల 15వ తారీకున నిర్వహించేకళాపీఠంప్రాంగణం పరిశీలించారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతిని పురస్కరించుకుని నిర్వహించే నాలుగవ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ పి రాజబాబు, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, స్థానిక శాసనసభ్యులు అనిల్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఈ బృందం డాక్టర్ వెంపటిచినసత్యం స్మృతి సదనంను పరిశీలించారు. ఆరోజున ఆయన విగ్రహం వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి చేశారు. సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకరాలు భావన పెదప్రోలు మాట్లాడుతూ కూచిపూడిలో నాట్య ప్రదర్శన కోసం పలు ప్రాంతాల నుంచి వెయ్యి మంది కూచిపూడి నాట్య కళాకారులు తరలివస్తారని పేర్కొన్నారు. వారితోబృంద, మహా బృందనాట్యాలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసత్యం మాస్టారు గారి పేరు ఏర్పాటుచేసిన ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం వేడుకలు తొలిసారి 2020లోచెన్నైలో ప్రారంభించామని పేర్కొన్నారు,. 2021 లోహైదరాబాదులో, 2022 లో విజయవాడలో నిర్వహించామని వివరించారు. ఈ ఏడాది ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్నఈ వేడుకలను సాంస్కృతి శాఖామంత్రి సూచనలతో చిన్న సత్యం మాస్టారు పుట్టిన గడ్డ కూచిపూడి లో నిర్వహిస్తున్నట్లు వెల్లడి చేశారు. ఈ సందర్భంగా సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ తరఫున ఏటా మాదిరిగానే పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం, లంకా అన్నపూర్ణాదేవి, పద్మశ్రీ డాక్టర్ శోభా నాయుడు, వెంపటి వెంకట్(జనసత్యం మాస్టర్ కుమారుడు) అవార్డులను అందజేస్తామని ప్రకటించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.5లక్షలు అందజేస్తుందని పేర్కొంటూ అవార్డుల కోసం నాట్యాచార్యులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, ఘంటసాల పవన్ కుమార్, తహసీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండిఓ జి సుధాప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే జీతభత్యాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చి, అక్కడే శాశ్వతంగా పని చేయాలి అన్న నిబంధనతో తమను ఎటువంటి పోటీ పరీక్షలకు అనుమతించకుండా మా ఒరిజినల్ సర్టిఫికేట్స్ అన్నీ కూడా వారి వద్దనే ఉంచుకుని యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని పలువురు ఉపాధ్యాయులు సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు స్పందనలో పిర్యాదు చేశారు. వారి పిర్యాదులో మేనేజ్మెంట్‌మా పాఠశాల 1899లో సెయింట్ ఆన్స్ ఆఫ్ ప్రొవిడెన్స్ అనే రిజిస్టర్డ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ప్రారంభియారని, 2009 వరకూ ఆంగ్లో ఇండియన్ బోర్డుకు అనుబంధంగా ఉండి సిబియస్ఇ బోర్డుకు అనుబంధ పాఠశాలగా మారింది. సుమారు 4 వేల మంది విద్యార్థుల నుండి ఫీజుల రూపంలో రూ.14,06,44,800 సేకరణతో, ఇతరత్రా బిల్డింగ్ ఫండ్ అనే పేరుతో డొనేషన్స్ సేకరణతో, కోట్లలో రిజర్వ్ ఫండ్ కలిగిఉందన్నారు. అయితే ప్రస్తుత యాజమాన్యం, ఉద్యోగుల జీతాల చెల్లింపులో మాత్రం ఎంతో నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.శాశ్వత ప్రాతిపదికపైన నియమితులైన ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం రెండు మూడు దశాబ్దాలుగా సంబంధిత స్థాయిలోని ప్రభుత్వ ఉద్యోగులతో సరిసమానంగా జీతభత్యాలు తదితర సదుపాయాలు అందించింది గత మేనేజ్ మెంట్ అన్నారు. 2017లో యాజమాన్యం అవగా హనా రాహిత్యంతో జీతభత్యాలు, గ్రాట్యుటీ చెల్లింపులో అవకతవకలకు పాల్పడిందన్నారు. ఆనంతరం ఉద్యోగులందరు సంఘటిత పోరాటంతో తప్పు దిద్దుకుని మళ్లీ యధావిధిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జీతభత్యాలు, పి ఆర్ సీ అమలు, గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులు, వైద్య సెలవులు మొదలైనవి సక్రమంగా మంజూరు చేశారు. ప్రస్తుతం ఉన్న యాజమాన్యం కమిటీ అనే పేరుతో సీబీఎస్ఈ అఫిలియేషన్ సందర్భంలో ప్రభుత్వం తరపున డి.ఇ.ఓకి ఆధారాలతో సమర్పించి, ఆమోదించేసిన అపెండిక్స్-3ను పూర్తిగా ఉల్లంఘిస్తోందని, ఐదుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా పదవీచ్యుతులను చేసింది. సీబీఎస్ఈ నియమ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం మధ్యలో (సీబియస్ఈలో విద్యా సంవత్సరం ఏప్రిల్ నుండి మార్చి వరకు)అన్నారు. 2018 పీఆర్సీ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2022 జనవరి నుంచి అమలులోకి రావలసి ఉండగా తీవ్ర జాప్యం చేశారు. తాము డిమాండ్ చేయగా ఆగస్టు 2022 నుంచి అమలులోకి తీసుకువచ్చారు. అందులో పే ఫిక్సేషన్ మాత్రం 2018 పీఆర్సీ నియమావళి ప్రకారం జరగలేదు. దానితో ఎంతో మందికి 4,5 ఇంక్రిమెంట్స్ వ్యత్యాసం ఉందన్నారు, ఉపాధ్యాయులకు ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన స్పందించి డి.ఇ.ఓ ఈ విషయంపై సమగ్ర పరిశీలన చేసి త్వరితగతిన శాశ్వత ప్రాతిపదికన వారికి న్యాయం జరిగే విధంగా చేయాలని సూచించారు.

ఉర్దూ అకాడమీ సిబ్బందికి ఎంటీఎస్ అమలు చేయాలి



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఉర్దూ అకాడమీలో విధులు నిర్వహిస్తున్న వారికి మీనిమమ్ టైం స్కేల్ (ఎమ్‌టిఎస్) వర్తించే విధంగా తనవంతూ కృషి చేయటమే కాకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళతామని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీ షేక్ మస్తాన్ వలి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులకు హామీ ఇచ్చారు. సోమవారం అసోసియేషన్ నాయకులు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీని కలిసి రాష్ట్రంలోని ఉర్దూ అకాడమీ సెంటర్లలో పనిచేస్తున్న 167 మంది సిబ్బందికి మీనిమమ్ టైం స్కేల్ ను అమలు చేయాలని కోరారు. నాయకులు అన్ని జిల్లాలో వైసిపి ప్రజా ప్రతినిధులను,ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ లను కలిసి విజ్ఞప్తి చేశారని అందరూ సానుకూలంగా స్పందించి సమస్యపు పరిష్కరించటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.గత 25 సంవత్సరముల నుండి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న సిబ్బంది ఇచ్చిన లేఖలను అమోదించాలని కోరుతూ వచ్చారన్నారు.ఉర్దూ అకాడమీ సిబ్బందికి ఎమ్‌టిఎస్ అమలు చేయాలని సిఫారసు లేఖను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ లేఖలను ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీ షేక్ మస్తాన్ వలికి అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సామ్రాజ్యవాద తిరుగుబాటు సింహ స్వప్నం - విప్లవ ధ్రువతార ... చేగువేరా

విశాలాంధ్ర-విజయవాడ : అమెరికా సామ్రాజ్య వాద సింహ స్వప్నం , విప్లవాల ధ్రువ తార చే గువేరా అని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా కార్యదర్శి దొనేపూడి శంకర్ కొనియాడారు. ఆదివారం చే గువేరా 56 వ వర్థంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విప్లవ దృవతార చేగువేరా 56వ వర్థంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంధర్భంగా విజయవాడ దాసరి భవన్ లో చే గువేరా చిత్ర పటానికి దొనేపూడి శంకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ విప్లవాల ధ్రువ తారగా పేరొందిన చే గువేరాను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. చేగువేరా స్పూర్తి తో యువజన ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. క్యూబాలో ఫెడల్ క్యాస్ట్రో తో కలసి గెరిల్లా యుద్ధం చేసి క్యూబా లో విప్లవం సాధించిన గొప్ప వీరుడు చే గువేరా అని అన్నారు .అనేక యూరప్ దేశాలకు క్యూబా నుంచి వైద్యుల ను పంపించి మానవత ను చాటుకోవడం ఒక్క క్యూబా దేశానికే దక్కిందన్నారు. చే గువేరా వృత్తి రీత్యా వైద్యవృత్తి కావడంతోనే ఆదేశానికి ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టారు. చే స్పూర్తితో పెద్ద ఎత్తున యువకులును సమీకరించి ఆయన పోరాటంను అందుకోని యువజన సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెయ్యాల పృధ్వీ రాజ్, నగర కార్యదర్శి లంకా గోవింద రాజులు, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షులు లంకే సాయి, గాడి అజయ్, శింగంశెట్టి. మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న మహిళా సమాఖ్య నగర మహాసభ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): 12న నగర మహిళా సామాఖ్య మహాసభను జయప్రదం చేయాలని నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో 47- 57 డివిజన్ కమిటీల మహాసభలు ఘనంగా నిర్వహించారు. 47 వ డివిజన్ మహాసభ టేనర్ పేట స్కూల్ వద్ద, రెడపంగు ఉమా అధ్యక్షతన జరిగిన మహాసభలో నగర అధ్యక్షులు ఓర్సు భారతి, నగర నాయకురాలు చింతాడ పార్వతి పాల్గొనగా, 57 వ డివిజన్ మహాసభ కొత్త రాజరాజేశ్వరి పేటలో పార్వతి అధ్యక్షతన జరిగిన మహాసభలో నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నగర నాయకులు దుర్గాసి రమణమ్మ, డి సీతారావమ్మ పాల్గొన్నారు. ఈ రెండు డివిజన్ల మహాసభలలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. అనంతరం ఆయా మహాసభలను ఉద్దేశించి భారతి, దుర్గాంబ మాట్లాడుతూ 12న విజయవాడ నగర మహిళా సమాఖ్య మహాసభ, రాష్ట్ర నాయకత్వ పర్యవేక్షణలో, చిట్టినగర్ సెంటర్ వద్ద, విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం నందు జరుగుతుందని, ఈ మహాసభకు నగర మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

47వ డివిజన్ నూతన కమిటీ

గౌరవఅధ్యక్షులు రెడపంగు అనసూయ, అధ్యక్షులు డొక్కా విజయమ్మ, కార్యదర్శి రెడపొంగు ఉమా, ఉపాధ్యక్షులు సమ్మెట మరియమ్మ, సహాయకార్యదర్శి కామల్ల సలోమి, కోశాధికారి నగిరికంటి షలోమి, సభ్యులుగా బొంగరాల దుర్గ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 57వ డివిజన్ నూతన కమిటీ గౌరవఅధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షులు పొన్నూరు రత్నకుమారి, కార్యదర్శి మేకా పార్వతి, సభ్యులుగా చంద్రమ్మ, డి వసంత, కె రామలక్ష్మి, పేరుమల్ల చంద్రమ్మ, ఎల్ స్వాతి లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ధూళిపూడి వెంకటరమణ బాబు, సీనియర్ నాయకులు రెడపంగు యాకోబ్, 47 వ డివిజన్ కార్యదర్శి రెడపంగు మైకేల్, స్థానిక నాయకులు రెడపంగు ప్రభుదాస్ పాల్గొనగా, 57వ డివిజన్ కార్యదర్శి గాడి దుర్గారావు, రాహేళమ్మ, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర-మైలవరం: సామాన్య ప్రజలకు పెనుబారంగా మారిన పెంచిన విద్యుత్ చార్జీల ను వెంటనే తగ్గించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబరు 9 నుంచి 5 తేదీవరకు రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన విద్యుత్ చార్జీల వ్యతిరేకంగా వివిధ రూపాల్లో పోరాటాలు కొనసాగించాలని సీపీఐ ఇచ్చిన పిలుపు లో భాగంగా సోమవారం నియోజకవర్గ పరిధిలోని జి. కొండూరు మండలంలోని కవులూరు గ్రామములో నిర్వహించిన కార్యక్రమానికి బుడ్డి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో ఏడు సార్లు విద్యుత్ చార్జీలను ప్రజల పై ధరలపై పెను భారాన్ని మోపారని,వీటితో పాటు నిత్య వసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నిరకాల ధరలు పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజా పోరాటాలతోనే నాయకులపై ఒత్తిడి తెచ్చి ధరలు తగ్గించుకోవాల్సినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు పెద్దలు ధనేకుల శ్రీనివాసరావు, గర్నెపూడి సత్యన్నారాయణ,ఎస్కే హఫీజ్ , పర్సలక్ష్మయ్య ,గొట్టుముక్కల వెంకట్రావు, గరిమెళ్ళ శ్రీరామ్మూర్తి, గగ్గర మణి తదితరులు నాయకత్వం వహించారు.

పోరుకు సన్నద్ధం : అడపా సుబ్బారావు

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువులు, కూరగాయాల ధరలతో ప్రజలు సతమతమవుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు విద్యుత్ చార్జీలను పదే పదే పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న పాలకులపై పోరుకు ప్రజలు సన్నద్ధం కావాలని సీపీఐ రెడ్డిగూడెం మండల కార్యదర్శి అడపా సుబ్బారావు పిలుపునిచ్చారు. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలం శాయన్నపాలెంలో సోమవారం విద్యుత్ చార్జీల వ్యతిరేక కార్యక్రమాన్ని స్థానిక సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిత్యావసర సరుకుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకపోయి ప్రజలు పడుతున్న ఇక్కట్లు అంతాయింతా కాదన్నారు. ఇక ప్రజలే తిరగబడి ఉద్యమబాట పట్టి ధరలు తగ్గించుకోక తప్పదని సూచించారు. ఈకార్యక్రమానికి స్థానిక సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కాళంగి ముత్యాలరావు, కాళంగి గోపిరాజు, అడపా వెంకటేశ్వరరావు, వీర్ల వెంకటేశ్వరరావు, పిన్నుబోయిన వెంకటేశ్వరరావు, వీర్ల మారేశు, నక్కనబోయిన శ్రీనివాసరావు, తదితరులు నాయకత్వం వహించారు.

రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైళ్లలో ప్రయాణికుల విలువైన వస్తువులను చోరీలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 62 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ సిఐ కె.శ్రీనివాసరావు,ఆర్పీఎఫ్ సిఐ టి.చంద్రశేఖరరెడ్డి, తెలిపారు.సోమవారం వారు మాట్లాడుతూ నగరంలో గవర్నర్‌పేట సమీపంలో ఒక వ్యక్తి అనుమానస్పదంగా సచరిస్తుండగా అనుమానం కలిగి అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన చుక్కపల్లి బాబి(22) సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు.3 కేసుల్లో పాత నేరస్థుడుగా ఉన్నారన్నారు.నిందుతుడిని అరెస్ట్ చేసిన జి.ఆర్.పి సబ్ ఇన్స్పెక్టర్ ఖాదర్ హుస్సేన్,ఆర్పిఎఫ్ ఎస్ఐ మకత్ లాల్ నాయక్,సిబ్బంది ఉన్నారు.వారిని అధికారులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై
రైతులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కనపర్చేలా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రజల భాగస్వామ్యం తో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో 12 సెంట్లలో కూరగాయలు, దుంప, తీగజాతి రకానికి చెందిన నిరంతర పంటలను పండించే ఎనీ టైమ్ మనీ మోడల్‌ను కలెక్టర్ మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏడాదంతా ఆదాయం వచ్చే విధంగా వివిధ పంటలను పండించే విధానం ద్వారా రైతులకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ పీ.సంపత్‌కుమార్, ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం విజయకుమారి, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.నాగమణిమ్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదిక : కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక అయిన స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం స్పందన కార్యాక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలకు నిర్ధేశించిన గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను తిరిగి నమోదు కాకుడదని, సమస్యల పరిష్కారానికి స్పందన ఏకైక మార్గమని అర్జీదారులు ఎంతో ఆశతో అందజేస్తున్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సిన భాధ్యత మనపై ఉందని, స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. స్పందన గ్రీవెన్స్ పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ఆయా శాఖాధికారులు శ్రద్ద పెట్టాలన్నారు. స్పందనలోనే కాకుండా జగనన్నకు చెబుదాం-1902, అన్‌లైన్ పోర్టల్‌లో నమోదవుతున్న అర్జీలను అధికారులు ప్రతి రోజు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.పీ.సంపత్‌కుమార్, డీఆర్‌వో వెంకటేశ్వర్లులు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, హౌసింగ్, డ్వామా పీడీలు శ్రీనివాస్, ఉమాదేవి, రజినీకుమారి, సునీత, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయభారతి, గిరిజన సంక్షేమ శాఖాధికారి రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక 50వ డివిజన్ కేబీఎన్ కాలేజీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియెగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడున్న ప్రజలు చాలా వరకు కొండ ప్రాంతం వాసులేనని కావటం వల్ల వాళ్లకి పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు, మందులు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందుబాటులో ఉచినట్లు తెలిపారు. ప్రజల వద్దకే పాలన అన్నట్టు ప్రజలు ఉన్నచోటే ఇటువంటి ఆరోగ్య శిభిరాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ శిభిరంలో 1226 ఓపీలు నమోదు కావటం పట్ల నగర పాలక సంస్థ కమిషనర్ సంతృప్తిని వ్యక్తపరుస్తూ ఈ శిభిరంలో 170, 175, 176, 177 సచివాలయాల పరిధిలోని ప్రజలంతా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ వైసీపీ ఇంఛార్జి బీ.విజయ, 50వ డివిజన్ కార్పొరేటర్ బీ.సత్యబాబు, జిల్లా వైద్య శాఖాధికారి సుహాసిని, సీఎంఓహెచ్ పీ.రత్నావళి, పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని కరోనా కాలంలో నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లను పునః ప్రారంభించాలని రైల్వేస్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేయ్యాల పృథ్వీరాజు,విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు బృందం విజయవాడ రైల్వే డీఆర్ఎం ఏ నరేంద్ర పాటిల్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న రైల్వే శాఖ ప్రతి రోజు దేశంలో వివిధ ప్రాంతాలకు కోట్లాదిమంది ప్రజలు రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. రైల్వే శాఖ కూడా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందని, ప్రమాదాలు కూడా జరగకుండా నిరంతరం రైల్వే సిబ్బంది కృషి చేస్తుందన్నారు. రైల్వే టికెట్ రేట్లు కూడా అందుబాటు ధర ఉండడం సమయానికి అనుగుణంగా రైలు నడవడం మంచి పరిణామం అని వారన్నారు. కరోనా కారణంగా ప్యాసింజర్ రైలు నిలిపివేయడం తర్వాత తిరిగి పున ప్రారంభం కావడం లేదని తెలిపారు. కేవలం ఎక్స్‌ప్రెస్ రైలు తిరగడంతో ఎక్కువ రిజర్వేషన్ బోగీలు ఉన్నాయని, జనరల్ బోగీలు ప్రతి రైలు కు రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉన్నాయని .దీనివల్ల పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరల్ బోగీలలో ప్రజలు ఒకరిపై ఒకరు నిలుచుకొని ప్రయాణం చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రయాణం చేయాలంటే వందే భారత్ రైలు టికెట్ ధరలు తగ్గించాలని, విమాన స్థాయి ధరలు వందే భారత్ రైలుకు ఉన్నాయని పేర్కొన్నారు. సంస్కరణల పేరుతో లాభాలు వస్తున్న రైల్వే ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రైవేటీకరణ చేస్తే ఉద్యోగాలు సంఖ్యను తగ్గడం టికెట్ ధరలు పెరగడం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా రైల్వేను కొనసాగించాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ రైల్లో జనరల్ బోగీలను పెంచాలనీ,ప్యాసింజర్ రైళ్లను పునః ప్రారంభించాలనీ,వందే భారత్ రైల్ టికెట్ ధరలను తగ్గించాలని, రైల్వే శాఖను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి, ప్రయాణికుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి, రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలిలని డిఆర్ఎం నరేంద్ర పాటిల్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సింగంశెట్టి మోహన్ ప్రసాద్, పి హరికుమార్, గాడి అజయ్ పాల్గొన్నారు.

'సంకల్పసప్త'

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండల స్థాయిలో సోమవారం సంకల్పసప్త కార్యక్రమాలు నిర్వహించారు. చిల్లకల్లు ప్రాజెక్టు అధికారిణి లక్ష్మి భార్గవి ఆదేశాల మేర, సూపర్ వైజర్ ఉ షా ఆధ్వర్యంలో సంకల్ప సప్త కార్యక్ర మాలు మండల స్థాయి లో అంగన్వాడీ కార్యకర్తలు అందరు పాల్గొని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పోషకాల తో కూడిన పోష్టిక ఆహారాని తయారు చేసి ఈ ఈ ఏ గ్జ బిషన్ నిర్వహించి. స్టా ల్సు నిర్వహించి. ప్రిస్కూల్ మెటీరియల్, గర్భవతులు తీసుకోవా ల్సిన జాగ్రత్త లు,మరియు పోష్టి క ఆహారం కు సంబంధించి చాక్స్ మొత్తం స్టాల్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మి భార్గవి. సూపర్ వైజర్ ఉ షా ఎం పిఓ ప్రసాద్. ఎంఈఓ రవీంద్ర నాయక్, ఎపి ఎం.రాజారావు. ఎఓ ప్రభుత్వం అధికారులు. అంగన్వాడీ కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, SRAVANTHI RAVALA (Old Name), W/o Anoop Epuri, residing at 503, Green Avenues Apartment, NRI School Road, Gollapudi 521225, NTR District, AP. I have changed my name to SRAVANTHI EPURI (New Name). Hence forth I will be known as SRAVANTHI EPURI

బార్ అసోసియేషన్ నిరసనలు

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రతి పిటీషన్కు 20 రూపాయలు వెల్ఫేర్ స్టాంపు అతికించ మని ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తూ నందిగామ బార్ అసోసియేషన్ విధులను బహిష్కరించారు. బార్ కౌన్సిల్ సభ్యులు బార్ అసోసి యేషన్ లతో ఎలాంటి సంప్రదింపులు చర్చలు జరుపుకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల జూనియర్ న్యాయవాదులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పేద బడుగు బలహీన వర్గాలు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన కక్షిదారులు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు ప్రతి పిటిషన్ పై 20 రూపాయలు వెల్ఫేర్ స్టాంపు అతికించమనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బొబ్బిలిపాటి భాస్కర్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ షేక్ ఆజాద్ సీనియర్ న్యాయవాదులు కాట్ర సత్యనారాయణ,యర్రంరెడ్డి బాబురావు, మన్నెం నారాయణరావు, సిహెచ్ సాంబశివరావు,చిరుమామిళ్ల శ్రీనివాసరావు,రామచంద్ర రెడ్డి , కొండ కోటేశ్వరరావు, మౌళేశ్వరరావు, నూతన్ ,బాబు మంగయ్య ,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై వైద్యశిబిరం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రోగులకు ఉచిత నేత్ర వైద్యసేవలందించారు. స్థానిక లయన్స్ మల్టీపర్పస్ భవనంలో జరిగిన ఈ శిబిరాన్ని సీనియర్ సభ్యులు డా.బొమ్మారెడ్డి రామిరెడ్డి ప్రారంభించగా, ఇతర సీనియర్ సభ్యులు ఎన్.టి. వెంకటేశ్వరరావు, జాన్‌బాబు, జోన్ చైర్మన్ టి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమూరి శ్రీనివాసరావు, డా.ఎం.కిరణ్, కోశాధికారి కోట పుల్లారావు తదితరులు పర్యవేక్షించారు. నూజివీడు జీఎంహెచ్‌కు చెందిన వైద్యనిపుణులు డా.జమ్‌రూద్ షాహిన్, డా.చిగురుపాటి హెూసిత సేవలందించారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటరెడ్డి, ఈఆర్,డా.కె.శ్రీనివాసరావు, జె.టి.రాజేప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 128మంది రోగులను పరీక్షించగా, వీరిలో 42మందికి శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించినట్లు తెలిపారు. డా.జె.రంగారెడ్డి వీరందరికీ అవసరమైన శస్త్రచికిత్సలను అన్ని సదుపాయాలు, మందులను ఉచితంగా అందించేందుకు ముందుకొచ్చారు.

నిష్కామ సేవకుడే నాయకునిగా మనగలడు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సభ్యులతో ఆత్మీయ బంధాన్ని పెంపొందించుకుంటూ నిస్వార్థంగా, నిష్కామంగా అందించే సేవలే నాయకునిగా మనగలిగేట్లు చేస్తాయని వాసవి క్లబ్బుల అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవి వి203ఎ జిల్లా ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అక్టోబర్ 29న జరిగే వాసవి జిల్లా కాన్ఫరెన్స్ కు సంబంధించిన రసీదు పుస్తకాలను, ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. సభ్యులు ఐకమత్యంగా అందించే సేవా కార్యక్రమాలతో సమాజంలో వాసవి క్లబ్బుల కీర్తి ప్రతిష్టలు అజరామరమవుతాయన్నారు. జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు మాట్లాడుతూ సభ్యులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మామిడి శ్రీనివాసరావు, తాత రజనీకుమారి, ఆలపాటి ప్రభాకరరావు, కొత్త గణేష్ బాబు నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF Vth ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. No.1662 of 2021
BETWEEN:
State Bank of India RACPC-2, rep by Chief Manager, Vijayawada - PLAINTIFF
AND
Nadella Vamsi Krishna son of Satyanarayana, D.No. 10-35, Tulasi Nagar, 4th Lane Varalakshmi Puram, Ashoknagar, Vijayawada-7 - DEFENDANT
Defendant take suit summons in the above suit filed against you by the bank for relization of the suit amount of Rs.16,21,341/- under the loan Account No. 37320387229 and the said suit stands posted to 15-11-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10-30 A.M. personally or through an advocate. Else next step follows.
//By Order //
T.V.N.Vasudeva Rao
Advocate for Plaintiff

IN THE COURT OF Vth ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. No.2019 of 2021
BETWEEN:
State Bank of India Labbipet, rep by Chief Manager, Vijayawada - PLAINTIFF
AND
Kosanam Vijaya Bhaskar son of Leelambar, 41-1/8-4A, 3rd Lane Gowtami Nagar, Krishna lanka, Vijayawada-13 - DEFENDANT
Defendant take suit summons in the above suit filed against you by the bank for relization of the suit amount of Rs.5,29,109/- under the loan Account No. 38260160806 and the said suit stands posted to 15-11-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10-30 A.M. personally or through an advocate. Else next step follows.
//By Order //
T.V.N.Vasudeva Rao
Advocate for Plaintiff

ప్రజలపై భారాలు వేస్తున్న జగన్

విశాలాంధ్ర-విజయవాడ : ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగా పెంచిన విద్యుత్ చార్జీలను నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యతిరేకించినారని, అయితే నేడు ప్రపంచ బ్యాంకు షరతులకు తలవగ్గి ప్రజలపై భారాలు వేస్తున్న జగన్మోహన్ రెడ్డి విధానాలను అమలు చేసేందుకు ముందుకు వెళుతున్నారని ఆ ప్రయత్నాలను నిరసించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ 36వ డివిజన్ ఆధ్వర్యంలో రామకోటి మైదాన ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు రద్దు కోరుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు, పెంచిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిపిన చారిత్రాత్మికమైన విద్యుత్ ఉద్యమంలో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. నాటి కాంగ్రెస్ పక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చార్జీల పెంపును నిరసిస్తూ నిరాహార దీక్ష చేశారని, నేడు ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి ప్రజలు తిరస్కరించిన విధానాన్ని అమలు చేసేందుకు పూనుకోవటం దుర్మార్గం అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదానీ కంపెనీకి, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కడపలోని ట్రాన్స్మిషన్లకు మరమ్మత్తు చేసే షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కు స్మార్ట్ మీటర్ల టెండర్లు అప్పగించటం లోని అంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఇప్పటికీ ఏడు సార్లు కరెంటు చార్జీలు పెంచారని, ఇంటి పన్ను, చెత్త మీదపన్ను, వీటితోపాటు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యులు బ్రతకలేని పరిస్థితి,రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఒక చేత్తో సంక్షేమ పథకాలు ఇస్తున్నట్టు ఇచ్చి, మరో చేత్తో విపరీతమైన బాదుడు ప్రజలపై వేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మూలి సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు ఓర్సు భారతి, ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు, డివిజన్ పార్టీ సహాయ కార్యదర్శి గుర్రం జమలయ్య, మందాడి రామకృష్ణ, ఎం,సామ్రాజ్యం, అన్నా మలై సక్కుబాయి,పి.సత్యవతి, పి.సాయి, కటారి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అందరికీ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర-కంచికచర్ల: మండల కేంద్రమైన కంచికచర్ల సచివాలయం -3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఎంపీడీవో బాల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వేల్పులు సునీత వైద్య అధికారులు ప్రజలకు అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను పరిశీలించి ప్రజలను వైద్యులు ఎలా చూస్తున్నారు ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి తెలుసుకొని ముందస్తుగా ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. వాడికి ఏమైందిరా ఎక్కడ ఉండగాప్రతి ఇంటికి వెళ్లి మరీ ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసు కోవడం, ఉచితంగా వైద్య పరీక్షలు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, మందులు, హెల్త్ ప్రొఫైల్ మ్యాపింగ్ తో పాటు "డా? వైఎస్సార్ ఆరోగ్యశ్రీ", "ఆరోగ్య ఆసరా" పై అవగాహన, అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆస్పత్రులకు పంపడం లాంటి జాగ్రత్తలతో పాటు వారు పూర్తి ఆరోగ్య వంతులయ్యేంతవరకు వారిని చేయి పట్టుకుని నడిపించే వినూత్న కార్యక్రమ మే "జగనన్న ఆరోగ్య సురక్ష.." అని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమల్లో సిబ్బంది ఎటువంటి నిర్లిప్తత లేకుండా వ్యవహరించాలని అన్నారు. అందరికీ ఆరోగ్యంతో పాటు ముందస్తు జాగ్రత్తలు సూచించే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి సీఎం జగనన్న ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. సిడిపిఓ అధికారి భాగ్య రేణుక మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా ఆహారాన్ని ఔషదంగా తీసుకొవలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, వైద్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలను అందించండి

నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సంతృప్తికర పరిష్కారాలు అందించటంతో పాటు సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఆయా సమస్యలపై సంబంధిత విభాగం అధికారులు సూచించిన గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించి ఫిర్యాదులు పెండింగులో లేకుండా జాగ్రత్త వహించాలని, సచివాలయాల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత కార్యదర్శులు మాత్రమే పరిష్కరించాలని ఆదేశించారు. వీఎంసీ సంబంధిత విభాగం అధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం చూపి సమస్య పునరావృతం కాకుండా కృషి చేయాలని సూచించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. స్పందన వేదికలో అందుకున్న అన్ని సమస్యలకు పారదర్శకమైన పరిష్కారాన్ని, సూచించిన గడువులోపు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.రత్నావళి, సిటీ ప్లానర్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి, ఎస్ఇ నరసింహమూర్తి, ఏడీహెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు కాకతీయ - అపోలో విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-నందిగామ రూరల్ న్యూస్:- జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యం లో పెనమలూరు లో ని బ్లూమింగ్ డెల్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఇటీవల జరిగిన అండర్ -14,అండర్ -17 బాలబాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా సిమ్మింగ్ జట్టు ఎన్నిక కావడం ఎంతో ఆనందంగా ఉందని కాకతీయ అపోలో విద్యాసంస్థల అధినేత కాపా రవీందర్ నాథ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ - అపోలో విద్యార్థులు అండర్ -14 విభాగంలో కామా ప్రభు సాత్విక్ (ఫ్రీ స్టైల్ 50 మీటర్స్,బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్), సతరాజుపల్లి కీర్తన్ (ఫ్రీ స్టైల్ 50 మీటర్స్, 100 మీటర్స్ , బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్) విభాగమున ఎంపిక అవ్వగా,అండర్- 17 విభాగంలో బోడావుల వరుణ్ సాయి(బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్,ఫ్రీ స్టైల్ 50 మీటర్స్)విభాగంలో ఎంపిక అవటం జరిగినది అండర్ -19 విభాగము నందు కాకతీయ హెల్త్ క్లబ్ తరఫున చల్లా దీపక్ (50 మీటర్స్ బటర్ఫ్లై,50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్) విభాగము నందు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు పైన తెలిపిన కేటగిరిలో ఎంపిక అయ్యారని జిల్లా స్కూల్ గేమ్స్ సమైఖ్య కార్య నిర్వాహక కార్యదర్శి తోట అజయ్ కుమార్ తెలిపారు.ఈ విద్యార్థులను మరియు శిక్షణ నిర్వాహకులు ఆకుల గోపీచంద్ ను పాఠశాల చైర్మన్ కాపా రవీందర్ నాథ్ మరియు డైరెక్టర్ కాపా కార్తికేయ అభినందనలు తెలియజేశారు...

బిల్డర్ ఆత్మహత్య !

విశాలాంధ్ర-విజయవాడ(క్రైం): బిల్డర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన దాసరి హనుమంతరావు బిల్డర్‌గా పనిచేస్తారు. కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయి. మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేగంగా విగ్రహం, స్మృతి వనం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్వరాజ్ మైదానంలో నిర్మాణంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ స్మృతి వనం, శిలాఫలకం నిర్మాణ పనులను గ్రీనరీ పనులు, పచ్చదనం కోసం చేపట్టిన పనులు నిర్దేశిత గడువులోనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీవీపీ స్క్వేర్ మాల్‌లో సిలియో షోరూమ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సిలియో ఫ్రెంచ్ పురుషుల దుస్తుల బ్రాండ్, విజయవాడలోని పీవీపీ స్క్వేర్ మాల్‌లోని ప్రముఖ స్టోర్‌ను ప్రారంభమైంది. డెనిమ్, ఫ్యాషన్ జాకెట్‌లు, అధునాతన పోలో షర్టులు, వైబ్రెంట్ టై-డై షర్టులు, వెచ్చని శీతాకాలపు షర్టులు. హాయిగా ఉండే ఫ్లాన్నెల్ ఓవర్-షర్టుల అందుబాటులోకి ఉన్నాయని సీఈవో సిలియో అన్నారు. సరికొత్త స్టోర్ ప్రారంభించటం సంతోషకరంగా ఉందని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ అంబాపురం వాసులకు తాగు నీటి సమస్య పరిష్కారించాలని గ్రామ సీతాయ్య ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ అంబాపురం కోండ ప్రాంతంతో అటవీ భూమిలో నివాసముంటన్న ఇల్లులను పరిశీలించారు. అటవీశాఖ వారికి సమచానంగా రెవిన్యూ భూమి కేటాయించడం జరిగిందని, అది కూడా జీవో ఉందని సీతాయ్య కలెక్టర్‌కు వివరించారు. ఆ ఫైన్ కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉందని, అటవీ భూమి నివాసంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎంతో కాలంగా గ్రామ వాసులకు తాగు నీటి సమస్య పరిష్కారం కాలేదని, కృష్ణానది పక్కనే ఉన్న తమ గ్రామానికి మాత్రం మంచినీరు లేదని వివరించారు. తక్షణమే గ్రామానికి తాగు నీటి సమస్య పరిష్కారస్తామని కలెక్టర్ సానుకూలంగా

బడి ఈడు పిల్లలు బడిలోనా, బయటా ?

విశాలాంధ్ర-అవనిగడ్డ : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వాలు ఎన్ని ఆంక్షలు విధించినప్పటికి ఈ దిశగా ప్రయత్నాలు మాత్రం క్షేత్రస్థాయిలో జరగడం లేదు అనే దానికి ఇదోక నిదర్శనం. దివిసీమలో బడి ఈడు పిల్లలు ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో విచ్చలవిడిగా తిరుగుతూ మత్తు పదార్థాల వంటి వాటికి బానిసలు అవుతూ, దొంగతనాలు సైతం పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కనీసం ఆ గ్రామాల్లోని ఉపాధ్యాయులు కూడా ఆ ప్రాంతంలోని బడి ఈడు పిల్లలను బడిలో చేర్చేందుకు ఆశక్తి చూపడం లేదు. నేడు రాష్ట్ర ప్రభుత్వం చదువుకునే విద్యార్థులకు ఉచిత దుస్తులు, పుస్తకాలు, బూట్లు , మధ్యాహ్న భోజన పథకం , అమ్మవడి వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు ఆశక్తి చూపడం లేదు. గతంలో అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలన్న పుస్తకాలు, దుస్తులు, బ్యాగ్‌లు వంటి అన్నీ మనమే సమకూర్చుకుని ఇంటి వద్ద నుండి భోజనం స్కూల్‌కి తీసుకువెళ్ళవలసిన పరిస్థితిలు ఉండేవి. నేడు అలా కాకుండా అన్నీ ప్రభుత్వమే సమకూర్చి అమ్మవడి పథకం క్రింద సంవత్సరానికి 15 వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో ప్రభుత్వమే జమచేస్తున్నప్పటికి ఈ పథకాలను వెనుకబడిన కులాలు అయిన ఎస్.టి విద్యార్థులు మాత్రం పాఠశాలలకు ఆశక్తి చూపకపోవడం ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కానీ, ఉపాధ్యాయులు కానీ అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు మత్తు పదార్థాలు బానిసలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయప్రయాసలతో బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినప్పటికి క్షేత్ర స్థాయిలో అధికారులు ఉచిత పథకాలపై అవగాహన కల్గించలేకపోవడంతో బడి ఈడు పిల్లలు దర్జాగా బయటే తిరుగుతున్నారు. ప్రతి నెల 3 రోజుల పాటు బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడంతో పాటు నిరక్ష్యరాస్యతను కూడా రూపుమాపి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మక చేపట్టిన విద్యావ్యవస్థ బలోపేతం చేసేందుకు సహకరించినట్లు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆ దిశగా అడుగులు వేస్తారో లేదో వేచి చూడాలి.

ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో విఫలం

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో ఆశించిన మేర కొనసాగడం లేదు. దీనికి ఉదాహరణగా ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎం.డి.యు ల ద్వారా రేషన్ పంపిణీని ప్రారంభించారు. ప్రారంభంలో ఇంటింటికి వెళ్ళి రేషన్ పంపిణీ అందించగా, అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఎం.డి.యు లు రేషన్ వాహనాన్ని నిలిపివేసి ఆ ప్రాంత గృహిణులందరిని వాహనం వద్దకే వచ్చి రేషన్ తీసుకువెళ్ళే విధంగా సైరన్ మ్రోగించడం ప్రారంభించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఒక ప్రాంతంలో వాహనం అందించడం అంటే ఇంటింటికి రేషన్ పంపిణీ అవుతుందా అని ప్రభుత్వంపై రేషన్ కార్డు దారులు మండిపడుతున్నారు. గతంలో అయితే పగలు సమయంలో రేషన్ షాపులు తెరచి ఉండేవి. ఏదోక సమయంలో కార్డు దారులు వెళ్ళి రేషన్ తెచ్చుకునే వారు. నేడు ఎం.డి.యు ల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ జరగాల్సి ఉండగా ఇంటింటికి జరగకపోగా రేషన్ వాహనం వచ్చిన సమయంలో ఇంటి వద్ద ఉండి తీసుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక్కోసమయంలో సర్వర్ల సమస్యతో ఈ పాస్ యంత్రాలు పనిచేయకపోవడంతో లబ్దిదారుల నుండి వేలిముద్రలు తీసుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. కార్డు దారులనుండి రెండు పర్యాయాలు వేలిముద్రలు తీసుకోవలసి రావడంతో ఎక్కువ సమయం వృధా అవుతుందని, కార్డుదారులు వాపోతున్నారు. గతంలో అయితే షాపుకు వెళ్ళిన 5 నిమిషాల్లోనే రేషన్ తెచ్చుకునే వాళ్ళం అని ప్రస్తుతం రేషన్ తెచ్చుకోవాలంటే ఒక రోజు పని మానుకుని కుర్చోవలసి వస్తుందని వాపోతున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గం లో టీడీపీ నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. 'బాబుతో -నేను' పేరుతో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి దీక్షలను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్ల రామాంజనేయులు, రాష్ట్ర మహిళ కమీషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రాష్ట్ర భట్రాజు సాధికార సమితి కన్వీనర్ ప్రత్తిగుడుపు ప్రసన్నాంజనేయరాజు, గుంటూరు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలియజేశారు. సాయంత్రం మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో కూర్చున్న వారిలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, మంగళగిరి రూరల్ మండల అధ్యక్షులు తోట పార్థసారథి, మంగళగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, మంగళగిరి రూరల్ మండల బీసీ సెల్ అధ్యక్షులు కఠారి అప్పారావు, రాష్ట్ర కృష్ణబలిజ సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం ద్వారానే రాజ్యాంగం పరిరక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : ఆధునిక స్వతంత్ర భారత నిర్మాణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సారథ్యంలో రూపొందించిన భారత రాజ్యాంగం దాని అనుబంధ వ్యవస్థల గురించి ప్రజల్లో చైతన్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ పటిష్టంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో 'రాజ్యాంగ చర్చా వేదిక' ఆవిర్భావ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పౌరులకు సంబంధించి ప్రాథమిక హక్కులు, న్యాయం, అభివృద్ధి, పరిపాలన గురించి విశేషంగా చర్చించారన్నారు. స్వాతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచిన సామాన్య ప్రజలలో రాజ్యాంగం పట్ల నేటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం, ఓపీడీఆర్ వంటి సంస్థలు ప్రజాస్వామ్య హక్కుల కోసం కొంతవరకు కృషి చేయటానికి ప్రయత్నం చేశాయన్నారు. అన్ని సమస్యలకు కోర్టులే పరిష్కారం అన్న అపోహలను విడనాడాలని చెప్పారు. చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ అధ్యక్షతన జరిగిన సభలో ఏఎన్‌యూ విశ్రాంత ఉపాధ్యక్షులు డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తాతా సేవ కుమార్, మేడా శ్రీనివాస్, అవధానుల హరి, పీఎస్ మూర్తి, నడింపల్లి కమలకాంత్, ఎంవీ రాజారామ్, ఎస్సార్ సంకు, కొండా శివరామిరెడ్డి, చెరుకూరి సత్యనారాయణ, జొన్నలగడ్డ రామారావు, కిలారి రాజన్ బాబు, పీవీ మల్లికార్జునరావు, వైవీఎస్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్య, హక్కుల కోసం ఫాతిమా కృషి

విశాలాంధ్ర-దుగ్గిరాల : దేశ తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ వర్ధంతి సోమవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని జెండా చెట్టు సెంటర్ వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫాతిమా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ఆనాటి అసమానతల సమాజంలో అడుగడుగునా వివక్ష ఎదు ర్కొంటూనే బాలిక విద్యకోసం, మహిళల హక్కుల కోసం ఫాతిమా షేక్ సావిత్రి బాయి పూలేతో కలసి ఎంతో కృషి చేసారన్నారు. 1848లో తన ఇంటినే మొదటి బాలిక పాఠశాలగా ఏర్పాటు చేశారన్నారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికల విద్య కోసం ఎనలేని కృషి చేసారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022లో ఎనిమిదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఫాతిమా జీవిత చరిత్రను చేర్చి తగిన గౌరవం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఖాసీం సాహెబ్, షేక్ రషీద్, పఠాన్ ఖాదర్, సయ్యద్ జలీల్, గాలాబ్ బేగ్, షేక్ బాజీ, షేక్ మస్తాన్ వలి, పెద్దేటి యోహాన్, గురువిందపల్లి సుగుణరాజు, బులుసుపాటి యల్లేశ్వరావు, కాకా వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వసంత దుర్గ శిష్య బృందానికి జ్ఞాపికలు అందజేత

విశాలాంధ్ర-తెనాలి : స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానము(కాణిపాకం) 2023-బ్రహ్మోత్సవముల సందర్భంగా శ్రీ లక్ష్మీ నారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ (తెనాలి) నాట్య గురువు పెసర్లంక వసంత దుర్గ శిష్య బృందం చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులందరికీ దేవస్థానం ట్రస్ట్ బోర్డు వారు జ్ఞాపికలను అందజేశారు.

అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే పరిశీలించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాదిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించి, కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి మరలా ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని, సదరు అర్జీలను విభాగాదిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొన్నారు. స్పందనలో 55 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

జై ఆంధ్రా డెమోక్రటిక్ ఫోరం అధ్యక్షుడిగా కాకాని

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ తరుణ్ కాకాని కొత్తగా ఏర్పాటు చేసిన 'జై ఆంధ్రా ప్రజాస్వామ్య వేదిక' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన జై ఆంధ్రా డెమోక్రటిక్ ఫోరం (జేడీఎఫ్) అధ్యక్షుడు తరుణ్ కాకాని మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడడమే తమ ఫోరం లక్ష్యం అన్నారు. సంస్థను బలోపేతం చేయడానికి, తన ఫోరమ్ ప్రజల నుండి మరియు ఇతర సంస్థల నుండి మద్దతు పొందడానికి కృషి చేస్తుందని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సిఫార్సులను ఇంతవరకు అమలు చేయకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు కాకాని వెంకట రత్నం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు పొట్టి శ్రీరాములు, పింగళి వెంకయ్య, కాకాని వెంకట రత్నం, గౌతు లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం తదితరుల నిబద్ధతను నేటి తరానికి వివరిస్తాం" అన్నారు. జై ఆంధ్రా డెమోక్రటిక్ ఫోరం ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, కార్యదర్శి ఎ హరి, ప్రతినిధులు బి రామమోహన్, డాక్టర్ టి సేవా కుమార్, వైవిఎస్ మహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.